www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 176 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | ఆదివారం -27 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana





## భజనలకు కొత్త స్టైల్.. 'భజన్ క్లబ్బింగ్' అంటే ఏంటి? మోదీ ఎందుకు పాల్గొన్నారు?

### భజనలకు ఆధునిక కచేరీ తరహా రూపమే 'భజన్ క్లబ్బింగ్'

- లైవ్ మ్యూజిక్, బీట్‌లు, చప్పట్లతో కార్యక్రమం
- ప్రేక్షకులు కూడా భజనల్లో భాగస్వాములయ్యే ఛాన్స్
- యువతలో కొత్త ఆసక్తిని పెంచుతున్న ఈ విధానం
- ఆధ్యాత్మికత, ఆధునిక సంగీతాన్ని కలిపే ప్రయత్నం

ఢిల్లీ: సాధారణంగా భజన అంటే ఓ చోట చేరి భక్తి పాటలు పాడటం.. తాళాలు వేయడం.

# పిక్సెల్స్ నుంచి పైపుల వైపు పాలన పయనం సాగింది

### దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న చివరి ఆయకట్టు రైతులకు నీరందించడమే లక్ష్యం

- ★ పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే: 'ది ప్రింట్' కథనంపై సీఎం చంద్రబాబు స్పందన
- ★ ది ప్రింట్ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పోస్టుపై స్పందించిన చంద్రబాబు
- ★ అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి చేరాలన్నదే తన నమ్మకమని వెల్లడి
- ★ సమస్యల పరిష్కారం, జీవనోపాధి కల్పనే ప్రధాన ఉద్దేశం



అమరావతి: ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ది ప్రింట్' వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. 'పిక్సెల్స్ నుంచి పైపుల వైపు' సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు. 'ది ప్రింట్' మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన 'సీఈఓ-సీఎం' ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు 'పిక్సెల్స్' (టెక్నాలజీ) నుంచి 'పైపుల' (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం

వివరాలు 2లో..

## స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు

### స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష




- సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్
- క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన
- కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికల మిగతా 2 లో

## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు



తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి మిగతా 2 లో




## జోరు పెంచిన ప్రశాంత్ కిశోర్.. ఢిల్లీలో నేడు అత్యంత కీలక సమావేశం

- పూర్తి స్థాయి పొలిటీషియన్ గా మారిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్
- బంకిపూర్ ఉప ఎన్నికలో స్వయంగా విజయం సాధించి సత్తా చాటిన పీకే
- దేశ రాజధాని ఢిల్లీకి పార్టీని విస్తరించే పనుల్లో ప్రశాంత్ కిశోర్

## ఇంధన నిర్వహణ అద్భుతం.. అదానీ సెంటర్‌పై లోకేశ్ ట్వీట్

### పర్యటన వివరాలను ఎక్స్ ఖాతాలో పంచుకున్న లోకేశ్

- ▸▸ అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేశ్
- ▸▸ రియల్ టైంలో విద్యుత్ ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్న తీరు పరిశీలన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా అదానీ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక మిగతా 2 లో

## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు'

### 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

- రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా మిగతా 2 లో




## ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు

- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ
- తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్ గా ఉందని వెల్లడి

# ఆనాడు సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది

### తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం: కేసీఆర్




హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని మిగతా 2 లో

- ➤ చాకలి ఐలమ్మ 131వ జయంతి
- ➤ ఘన నివాళి అర్పించిన కేసీఆర్
- ➤ నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు
- ➤ ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని వ్యాఖ్య



# రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన



## - పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**శరవేగంగా కొనసాగుతున్న పరిగి వికారాబాద్ నాలుగు లైన్ల రహదారి పనులు**

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: పరిగి నుంచి వికారాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పరిగి, షాద్‌నగర్ నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.లాల్పహాడ్--చిట్టెంపల్లి రహదారి, గడిసింగాపూర్--రంగారెడ్డిపల్లి డబుల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, ఎయిర్‌పోర్ట్ 17వ ఎగ్జిట్ నుంచి పరిగి,మైలారం,అనంతరెడ్డిపల్లి తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ,ఆర్అండ్‌బీ రోడ్లు, హకీంపేట్ ఇండస్ట్రియల్ ఏరియా, ఎడ్యుకేషనల్ హబ్ మీదుగా కోస్గి వరకు సుమారు 6,000 కోట్లతో ఆధునిక సిక్స్‌ట్రాక్ రేడియల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

# రూ.2 కోట్లతో నిర్మించిన నంచర్ల-చౌదర్పల్లి బీటీ రోడ్డు ప్రారంభించిన



## - ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల, చౌదర్పల్లి గ్రామాల మధ్య రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.అనంతరం స్థానిక నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రహదారి నిర్మాణంతో నంచర్ల చౌదర్పల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పిఏసిఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తి చిరస్మరణీయం

**ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన.**

**జాఫర్ పల్లి సర్పంచ్ సర్పంచుల సంగం అధ్యక్షుడు మహేష్ కుమార్...**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణంలో ఉన్న వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి జయంతి సందర్భంగా.. చేపల పల్లి సర్పంచ్ల సంగం అధ్యక్షులు మహేష్ కుమార్..... పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ... జాఫర్ పల్లి సర్పంచ్ మండల సర్పంచ్ల అధ్యక్షులు మహేష్ కుమార్... మాట్లాడుతూ.. అన్యాయాన్ని, అణచివేతను ఎదిరించి హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఐలమ్మ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన ధీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, సామాజిక న్యాయం కోసం నిలబడేందుకు ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఆమె ఆశయాలను గుర్తుచేసుకుంటూ సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పిస్తూ ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఆంజనేయులు, చాకలి లక్ష్మి, స్థానిక నాయకులు తదితరులు, రజకసంఘం నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

# వీరవనిత చాకలి ఐలమ్మ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): చాకలి ఐలమ్మ జయంతినీ పురస్కరించుకొని పరిగి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతంగ పోరాటంలో ధైర్యంగా నిలిచిన మహిళా పోరాట యోధురాలు నిజాం పాలనలో భూస్వాముల దోపిడీ పెట్టి చాకిరి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడారు.తనకు సంబంధించిన భూమిని కాపాడుకోవడంతో పాటు పేద రైతులు , కూలీల హక్కుల కోసం ఆమె నిర్భయంగా పోరాటం కొనసాగించిన మహోన్నత వ్యక్తి భూస్వాముల ఒత్తిళ్లకు బెదిరింపులకు లొంగకుండా ప్రజల పక్షాన నిలిచిన ఆమె ధైర్యం, తెలంగాణ రైతన్న పోరాటానికి స్ఫూర్తిగా నిలిచింది.భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ ధైర్యం చిరస్మరణీయం అని పేర్కొనారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ , కౌన్సిలర్ శ్రీనివాస్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్, మీరు తాహిర్ అలీ, శశాంక్ రెడ్డి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మకు ఘనంగా జయంతి నివాళులు...

## - జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు బీసీ వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘని, డి పి ఆర్ ఓ చెన్నమ్మ,సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందిపై దాడులను ఏమాత్రం ఉపేక్షించేది లేదు

## - వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,

**ఇరు వర్గాల మధ్యన ఘర్షణ విడిపించుటకు వెళ్లిన కానిస్టేబుల్ నర్సింలు**
**విడిపించుటకు వెళ్ళిన నర్సింలు కానిస్టేబుల్ కు కడుపులో కత్తి పరిగిలో ప్రథమ చికిత్స**
**కత్తితో శోభాయాత్రలకు రావడం ఏంటి? అసలు ఆ కత్తి ఎవరి గురించి తీసుకువచ్చారు! ఎవరికి స్కెచ్ మిస్ అయ్యింది! కానిస్టేబుల్ నర్సింలు కడుపులోకి చొచ్చుకుంది! అసలు పరిగి లో ఏం జరుగుతుంది! పరిగిలో నిఘా విభాగం పని చేస్తుందా! లేదా? ఇంత జరిగిన తర్వాత గాని అప్రమత్తం కాలేదు అంటే! ఆలోచించవలసిన అవసరమే!**
**స్కెచ్ మిస్సయిందా? ఆలోచనలు తారుమారయ్యాయా? ఆలోచించవలసిన అవసరం లేదా? శుక్రవారం అర్ధరాత్రి 4 గంటల వరకు ఎదురు చూశారంటే ఎవరి? కోసం! ఆ వ్యక్తి శోభాయాత్రకు రాలేదా? అప్పుడే వచ్చాడా? ఇరువర్గాలు అందుకే గొడవ పడ్డాయా? ఆ వ్యక్తి తప్పించుకున్నాడా? ఆలోచించి చూద్దాం మరి! పరిగి లో అర్థరాత్రి ఘటన దాదాపు నాలుగు గంటల సమయంలో**
**చట్టాన్ని ఎవరు చేతిలోనికి తీసుకున్నా! కచ్చితంగా చట్టపైనమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. హెచ్చరించిన ఎస్పి స్నేహమేహర**





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పోలీసు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులపై చేయి చేసుకోవడం, విధులకు ఆటంకం కలిగించడం తీవ్రంగా పరిగణించబడుతుంది. ఇలాంటి ఘటనలను ఏమాత్రం ఉపేక్షించేది లేదు. పరిగి పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున సుమారు 4:00 గంటల సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుండగా, పరిగి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నర్సింలు గొడవను అదుపు చేసేందుకు మధ్యలోకి వెళ్లారు. ఈ సమయంలో గొడవలో పాల్గొన్న తరుణ్ అనే వ్యక్తి కత్తితో కానిస్టేబుల్ నర్సింలుపై దాడి చేసి కడుపులో గాయపరిచాడు. సంఘటన జరిగిన వెంటనే పరిగి ఎస్ఐ, సీఐ, డీఎస్పీ అధికారులు స్పందించి గాయపడిన కానిస్టేబుల్ నర్సింలును పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి కాంటినెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కానిస్టేబుల్ నర్సింలు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, హైదరాబాద్‌కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నర్సింలును పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆసుపత్రి యాజమాన్యం మరియు వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ ఘటనపై పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా దర్యాప్తు వేగవంతం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.



### ఎస్పీ హెచ్చరిక

"పోలీసు సిబ్బంది ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, బెదిరించడం లేదా విధులకు ఆటంకం కలిగించడం ఎంతమాత్రం సహించేది లేదు. పోలీసులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. నిందితులపై రౌడీ షీట్ ప్రారంభించడం జరుగుతుంది. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు చేపడతాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా గొడవలకు పాల్పడటం, ఆయుధాలతో తిరగడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం లేదా పోలీసు సిబ్బందిపై దాడి చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవు." అని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, స్పష్టం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకము

## - జిల్లా కలెక్టర్ దీపక్ తివారి





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్)::సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, పరిగి, తాండూర్ శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డి లు హాజరై జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలతో జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.... పాఠశాలల్లో విద్యతోపాటు విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల నిమిత్తం అధిక నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి పాఠశాలలో మరమ్మత్తు పనులను చేపట్టి త్రాగునీరు, టాయిలెట్ సౌకర్యాలను కల్పించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు పౌర హక్కులు, విధుల పట్ల కూడా విద్యా బోధనలో భాగంగా ఉండాలని



కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభిష్టాల మేరకు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్య పట్ల నైపుణ్యం కలిగి ఉండాలని ఉద్దేశంతో ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ) లను ఏర్పాటు చేసి శిక్షణలో ఇవ్వడం జరుగుతుందని దీనివల్ల పరిశ్రమంలో పని చేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. మనిషి జీవనశైలిలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయని వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు క్రీడలు, వ్యాయామం వంటిపై ఆసక్తిని పెంచి శారీరక దృఢత్వం కార్యకలాపాలపై శ్రద్ధ వహించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు మును ముందు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ పురస్కారాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. పరిగి శాసనసభ్యులు టి. రామ్ మోహన్ రెడ్డి, బి. మనోహర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, అన్ని వర్గాల విద్యార్థులు ఒకే దగ్గర విద్యను అభ్యసించేందుకు వీలుగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏటీసీల ద్వారా శిక్షణలు ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదేవిధంగా వీటి వల్ల మహిళలు కూడా ఉపాధి పొందుతారని ఎమ్మెల్యే అన్నారు. తాండూర్ శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్ తరాల తలరాత మార్చేది విద్య మాత్రమేనని దీనికి దశాదిశను నిర్దేశించే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యపై ఖర్చు పెట్టడం పెట్టుబడి కాదని అది ఒక సంపదని గుర్తించి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తూ అధిక నిధులను వెచ్చించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ జిల్లాను మెరుగైన స్థానంలో ఉంచే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో



అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఫైనాన్స్ కమిషనర్ సభ్యులు రంగ రాజన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన

## - పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

**పరిగి కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్కొక్కరుగా చాకలి ఐలమ్మ వీరగాథలు వివరించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని, ఆమె ఆశయాల సాధనకు



కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. చాకలి ఐలమ్మ ఈ తరహాలో సేవలు చేసి మా జాతికి వన్నెతెచ్చింది:- పరిగి మహిళా నేతలు చాకలి లక్ష్మి చాకలి శాంతమ్మ చాకలి నిరంజని చాకలి లావని అంజులమ్మ లక్ష్మి చాకలి ఐలమ్మ పేదల గురించి ఆ రోజుల్లోనే వీరనారీగా ముందుకు వెళ్లి సమాజంలో జరుగుతున్న అన్యాయాల గురించి నిలదీయడం మా జాతి గర్వించదగ్గ విషయమని పరిగి మహిళ నేతలు గర్వంగా పేర్కొన్నారు. ఈరోజు సమాజంలో ఒక సముచిత స్థానం ఆ రోజుల్లోనే కల్పించిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ చేసిన పనులు సృష్టి ఉన్నంత వరకు ప్రతి ఒక్కరు గుర్తుంచుకుంటారన్న విషయాన్ని వారు పేర్కొన్నారు. మనము చాలా గర్వించవలసిన అవసరం ఉన్నదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ కృష్ణ ప్రసాద్, పరిగి పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, చాకలి ఆంజనేయులు, చాకలి జంగయ్య, జిల్లా అధ్యక్షుడు రాములు పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు జనరల్ సెక్రెటరీ శేఖర్ కోశాధికారి నర్సింలు ఉపాధ్యక్షులు జంగయ్య సలహాదారులు ఆంజనేయులు గోపాల్ శ్రీను సాయిలు సభ్యులు సురేష్ మల్లేష్ నవీన్ రాఘవేందర్ సురేష్ బాబు సంతు మహిళా సభ్యులు లక్ష్మి శాంతమ్మ నిరంజని లావణ్య అంజమ్మ లక్ష్మి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు



RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## రైతుల సందేహాల నివృత్తికి రెజోనియా టోల్‌ఫ్రీ నంబర్

**హాట్‌లైన్ నంబర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**రైతులు నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడే అవకాశం**

**సోమవారం నుంచి శుక్రవారం వరకు**

**ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సేవలు**

**ట్రాన్స్‌మిషన్ లైన్ పనులకు సంబంధించి సందేహాల నివృత్తి**



అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలో విద్యుత్ ప్రసార మార్గాల నిర్మాణానికి సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు రెజోనియా కంపెనీ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ హాట్‌లైన్ నంబర్‌ను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కంపెనీ ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక నుంచి అనంతపురం మీదుగా కడప జిల్లా సీకే దిన్నె వరకు హైపవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పనులకు సంబంధించి రైతుల్లో ఉన్న సందేహాలను నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి నివృత్తి చేసుకునేందుకు హాట్‌లైన్ ఉపయోగపడుతుందన్నారు. రైతులు మధ్యవర్తులు లేకుండా నేరుగా కంపెనీతో సంప్రదించే అవకాశం కల్పించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. రాయలసీమలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవకాశాలు ఉన్నాయని, ప్రసార మార్గాల అభివృద్ధితో సౌర, పవన, బ్యాటరీ నిల్వ ప్రాజెక్టులకు మరింత అవకాశం ఉంటుందని తెలిపారు. రెజోనియా ప్రాజెక్టు హెడ్ గిరిప్రసాద్ మాట్లాడుతూ తమ పరిధిలో సుమారు 40 వేల మంది రైతులు ఉన్నారని, వారి కోసం హాట్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్: 1800 309 4401. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఓడబ్ల్యూ మేనేజర్ వినోద్, సీఎస్ఆర్ మేనేజర్ కృతిక లక్ష్మి, ఎగ్జిక్యూషన్ మేనేజర్ జైకుమార్, కంపెనీ ప్రతినిధి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్టీఆర్ విశ్రాంతి భవనం ప్రారంభం



అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రాంగణంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎంపీ నిధులు రూ.75 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ విశ్రాంతి భవనాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్ఎంవోలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ హేమలత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థిని గాయపడిన ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలి

**ఆత్మకూరు కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని**

**మొదటి అంతస్తు నుంచి పడి గాయపడిన ఘటన**

**ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీసీపీఓకు బాలల హక్కుల కమిషన్ ఆదేశం**

**విద్యార్థినికి అందుతున్న వైద్యంపై ఆరా**

**భద్రతా చర్యల్లో అలక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరిక**

అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): అనంతపురం జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని మొదటి అంతస్తు నుంచి పడి గాయపడిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. మీడియా ద్వారా ఘటనపై సమాచారం తెలుసుకున్న కమిషన్ సభ్యుడు చల్ల మధుసూదనరావు పూర్తి స్థాయి నివేదికను సమర్పించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ)ను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై కమిషన్ ఆరా తీసింది. విద్యార్థిని త్వరగా కోలుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు అధికారులను, జీసీడీఓ, డీసీపీఓ, డీపీసీయూ అధికారులను సూచించింది. పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణలో ఎలాంటి అలక్ష్యాన్ని సహించబోమని చల్ల మధుసూదనరావు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేజీబీవీల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## తాడిపత్రి, గుత్తిలో నూతన కోర్టు భవనాల ప్రారంభం

**నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం**

**వర్చువల్‌గా ప్రారంభించనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి**

**కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు హాజరు**

అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): జిల్లాలోని తాడిపత్రి, గుత్తి కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన కోర్టు భవన సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమం సెప్టెంబర్ 27న ఉదయం 9 గంటలకు జరగనుంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీ సా గిల్ వర్చువల్ విధానంలో భవనాలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.ఎస్. భానుమతి, జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ చల్లా గుణరంజన్ హాజరుకానున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమరావు తెలిపారు. తాడిపత్రి, గుత్తి కోర్టులకు నూతన భవన సముదాయాలు అందుబాటులోకి రావడంతో న్యాయ సేవల నిర్వహణకు మరింత సౌకర్యం కలగనుంది.

## హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం



అనంతపురం, సెప్టెంబర్ 26,(మహి న్యూస్): జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు, ఉమ్మడి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి బి.ఎస్. భానుమతి, న్యాయమూర్తి సురేష్ రెడ్డిలకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఘన స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో న్యాయమూర్తులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమరావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి, ప్రోటోకాల్ న్యాయమూర్తి పావని తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం

**దాడులు జరిగితే బాధ్యులపై కేసులు.. పరిహారం వెంటనే అందించాలి**

**ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి: ఆర్డీవో వసంతబాబు**

కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 26,(మహి న్యూస్): ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు, అఘాయిత్యాలు, వివక్ష, హక్కుల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన అందించాలని సూచించారు. శనివారం ఆర్డీవో మినీ సమావేశ మందిరంలో ఆర్డీవో అధ్యక్షతన ఉపవిభాగ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, మాన్యువల్ స్కావెంజింగ్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసులు, వాటి దర్యాప్తు, బాధితులకు అందుతున్న న్యాయ సహాయం, పరిహారం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేసు నమోదు నుంచి బాధితులకు పరిహారం అందే వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. బాధితులు పోలీసు, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### ప్రతినెలా సివిల్ రైట్స్ డే



ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతినెలా చివరి తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఆర్డీవో ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు మండల స్థాయి అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వారి హక్కులపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీఎల్‌డీవో అనముల్లా, ఎంపీడీవో ధనుంజయనాథ్, ఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, డివిజన్ స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు మోహన్, రామాంజనేయులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, అటవీశాఖ అధికారి రామచంద్రుడు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్-రాయలసీమ రైజింగ్' ప్రారంభం

**మదనపల్లిలో కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అనంతపురం జిల్లా నుంచి రూ.2,252 కోట్లతో ప్రతిపాదనలు**

**41 క్లస్టర్లు, 32 మండలాల్లో ఉద్యాన అభివృద్ధికి ప్రణాళిక**

**సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు**

అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో చేపట్టిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమాన్ని అక్టోబర్ 2న మదనపల్లిలో ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన



విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమలో ఉద్యాన రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన క్లస్టర్ల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

### అనంతపురానికి రూ.2,252 కోట్ల ప్రతిపాదనలు

అనంతపురం జిల్లాలో 32 మండలాల్లోని 338 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 41 ఉద్యాన క్లస్టర్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంటలు, పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ నీటిపారుదల, ఫర్టిగేషన్ తదితరాలకు సంబంధించి మొత్తం రూ.2,252 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించినట్లు చెప్పారు. ఉద్యానవన శాఖ, ఏపీఎంఐపీ, ఏపీసీఎన్ఎఫ్, జలవనరుల శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

### రైతులకు విస్తృత అవగాహన

రాయలసీమలో పండే ఉద్యాన పంటలను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు జిల్లావ్యాప్తంగా రైతులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో 'నా జిల్లా--నా పంట' వ్యాసరచన పోటీలు, కళాశాలల్లో ఉద్యాన సాంకేతికతపై కార్యక్రమాలు, 41 క్లస్టర్లలో రైతులకు ప్రదర్శనలు, 'తోట బడి' ద్వారా ఫర్టిగేషన్, ఫార్మ్ పాండ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రచార రథాలు, కళాజాతాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఇన్‌చార్జి ఉద్యాన జిల్లా అధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

**పోలీసు యూనిఫాం అధికారంతో పాటు బాధ్యతను కల్పిస్తుంది: మంత్రి పయ్యావుల కేశవ్**

**ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి: కలెక్టర్ ఓ. ఆనంద్**

**తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేత**

అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో శనివారం ఎస్‌సీటీపీసీ (సివిల్) 2025--26 బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు సేవల్లోకి అడుగుపెడుతున్న శిక్షణార్థులకు అభినందనలు తెలిపారు. ఖాకీ యూనిఫాం అధికారంతో పాటు



బాధ్యతను కూడా ఇస్తుందని, ప్రజలకు పోలీసులే ప్రత్యక్షంగా కనిపించే ప్రభుత్వ ప్రతినిధులని అన్నారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు భద్రత కల్పించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పోలీసులు ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. మానవత్వంతో, బాధ్యతతో విధులు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతపురం నుంచి రాష్ట్రంలోనే అతిపెద్ద బ్యాచ్ పాసింగ్ అవుట్ కావడం గర్వకారణమన్నారు.

### ప్రజలకు న్యాయం అందించాలి

జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి ప్రవేశిస్తున్న పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ప్రజలు పోలీసుల నుంచి న్యాయం, భద్రత, మెరుగైన సేవలను ఆశిస్తున్నారని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు న్యాయం అందించేలా విధులు నిర్వహించాలని అన్నారు. అనంతరం ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు ముఖ్యఅతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, పీటీసీ ప్రిన్సిపల్ సుప్రజ, శిక్షణ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు, అసోసియేషన్ అధ్యక్షుడు తలారి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే వైద్య సేవలు

**అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.75 లక్షలతో విశ్రాంతి భవనం ప్రారంభం**

**ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం: మంత్రి సత్యకుమార్ యాదవ్**

**వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు**

**గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్య రథాల ద్వారా సేవలు**

అనంతపురం, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకుల కోసం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన నిధుల నుంచి రూ.75 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని, వారి సహాయకులకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. అనంతపురంలో క్యాన్సర్ చికిత్సా విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజలకు మరింత విశ్వాసం కల్పించేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.









### సంజీవిని ద్వారా ఉచిత వైద్య పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవిని' కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 42 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మధుమేహం, మూత్రపిండాలు, కాలేయం, రక్త సంబంధిత తదితర పరీక్షలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 933 ఆరోగ్య రథాలను ఏర్పాటు చేస్తున్నామని, డిసెంబర్ 10 నుంచి ప్రయోగాత్మకంగా నిర్వహించి, జనవరి 1 నుంచి సంజీవిని కార్యక్రమంతో అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం నివేదికలను 48 గంటల్లోపు ఫోన్, వాట్సాప్ ద్వారా పంపడంతో పాటు ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి తదుపరి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

### రోగుల సహాయకులకు సౌకర్యం

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. రోగుల సహాయకులు ఆసుపత్రి పరిసరాల్లో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి రూ.75 లక్షలతో విశ్రాంతి భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. భవనంలో మహిళలు, పురుషులకు వేర్వేరు విభాగాలతో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా పడకల సంఖ్యను పెంచడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్ఎంవోలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ హేమలత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ పలువురు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఐసీడీఎస్ శాఖపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సమీక్ష

**అంగన్వాడీ సేవలు, పోషకాహార పంపిణీలో 100 శాతం లక్ష్యాలు సాధించాలి**

అనంతపురం, సెప్టెంబర్ 26, (మహి న్యూస్): అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మహిళా, శిశు అభివృద్ధి శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సేవల అమలు, పోషకాహార పంపిణీ, ఖాళీ పోస్టుల భర్తీ, చిన్నారుల హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రోస్టర్ సమర్పించని సీడీపీవోలకు ఛార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. గత సమావేశంలో సూచించిన అంశాలపై చర్యల నివేదిక సమర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంబదూరు ప్రాజెక్టులో సంపూర్ణ పోషకాహార పంపిణీ 95 శాతంతో వెనుకబడి ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ప్రాజెక్టు 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని







సూచించారు. కాంట్రాక్టర్ల వల్ల సరఫరాలో ఆలస్యం జరిగితే ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. అనంతపురం గ్రామీణ, కనేకల్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారుల ప్రీ-స్కూల్ హాజరు శాతం మెరుగుపడాలని సూచించారు. పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు హాజరు కాకపోతే అంగన్వాడీ కార్యకర్తలు, పర్యవేక్షకులు వాట్సాప్ సమూహాల ద్వారా తల్లిదండ్రులను సంప్రదించి, ఫోన్, దృశ్య కాల్స్ ద్వారా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. రాయదుర్గం, డి.హీరేహాళ్ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక కేసులను సమీక్షించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం నిర్ణీత సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటికి తీసుకెళ్లే రేషన్ పంపిణీలో వెనుకబడిన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో పనితీరు మెరుగుపడాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీడీపీవోలు, పర్యవేక్షకులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉత్సవ్కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సాజిదాబేగం, డీఈవో అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, సీడీపీవోలు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# మురికివాడల్లేని మాచర్ల లక్ష్యం..!

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల, సెప్టెంబర్ 26 (మహి న్యూస్): మురికివాడలు లేని మాచర్ల పట్టణాన్ని నిర్మించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6, 7, 8, 10వ వార్డుల్లో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. స్థానికులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న అమృత్ పథకం పనులను పరిశీలించారు. 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అనంతరం పలువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, శశిరెడ్డి, బీజేపీ నాయకులు క్రాంతికుమార్, జనసేన నాయకులు లాల్ కిషన్, నర్రా రాముడు, కమాలకర్, భాగం హనుమంతరావు, వంకయాలపాటి రాజుకుమార్, చల్లా సాంబ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి..!

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల, సెప్టెంబర్ 26 (మహి న్యూస్): మాచర్ల పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 30 మంది శాశ్వత మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన యూనిఫాం వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో మున్సిపల్ సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని అన్నారు. అర్హులైన మున్సిపల్ సిబ్బందికి తప్పకుండా నివేశన స్థలాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్, బీజేపీ నాయకులు క్రాంతికుమార్, జనసేన నాయకులు కొమర లాల్‌కిషన్, అవినాష్‌రెడ్డి, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం

## రోడ్డు భద్రతా నిబంధనలపై దుర్గి ఎస్ఐ బి. గోపాల్ అవగాహన



దుర్గి, సెప్టెంబర్ 26 (మహి న్యూస్): దుర్గి మెయిన్ సెంటర్‌లో శనివారం దుర్గి ఎస్ఐ బి. గోపాల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. గోపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించి, సరిగ్గా బిగించుకుని వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ తలకు తీవ్ర గాయాలు కాకుండా రక్షణ కల్పిస్తుందని తెలిపారు. వాహనదారులు వేగాన్ని నియంత్రిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడటం, అతివేగంగా ప్రయాణించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. వాహనదారులతో పాటు పాదచారులు కూడా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ బి. గోపాల్ కోరారు.

# గడ్డిపాడు ఆర్‌ఓబీ నిర్మాణానికి శంకుస్థాపన

**రూ.147.36 కోట్లతో గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం**

**కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, వి. సోమన్న చేతుల మీదుగా శంకుస్థాపన**

**రోజుకు 78 రైళ్లు, 20 వేలకుపైగా వాహనాల రాకపోకలు**

**గుంటూరు పార్లమెంట్ పరిధిలో 8 ఆర్‌ఓబీలకు సుమారు రూ.750 కోట్ల నిధులు**



గుంటూరు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): గుంటూరు నగరంలోని గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ నంబర్--3 వద్ద రూ.147.36 కోట్లతో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న శనివారం శంకుస్థాపన చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన బహిరంగ సభలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గడ్డిపాడు రైల్వే గేటు మీదుగా రోజుకు 78 రైళ్లు, 20 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. రైల్వే గేటు మూసివేసిన ప్రతిసారీ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్‌ఓబీ నిర్మాణంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో మొత్తం 8 ఆర్‌ఓబీల నిర్మాణానికి సుమారు రూ.750 కోట్ల నిధులు కేటాయించినట్లు పెమ్మసాని తెలిపారు. నందివెలుగు, శంకర్ విలాస్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లోని ఆర్‌ఓబీల పనులను కూడా వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టులను చేపడుతోందన్నారు. రాష్ట్రంలో 78 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గడ్డిపాడు ఆర్‌ఓబీతో పాటు గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఇతర ఆర్‌ఓబీల నిర్మాణానికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, దక్షిణ తీర రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, డీఆర్ఎం సుధేష్ణ సేన్ తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యతతోనే వ్యాపారంలో నిలదొక్కుకోవాలి

**వ్యాపారంలో ఉత్పత్తి నాణ్యతే అత్యంత కీలకం: పెమ్మసాని చంద్రశేఖర్**

**వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకుని ఉత్పత్తులను మెరుగుపరచాలి**

**మార్కెటింగ్, ప్యాకేజింగ్, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**రుణాలు, వ్యాపార సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి**

గుంటూరు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): ఏ వ్యాపారంలోనైనా ఉత్పత్తి నాణ్యతే అత్యంత ముఖ్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు నగరంలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఏపీ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఎంఎస్ఎంఈ వృద్ధి కార్యశాలకు ఆయన శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత లోపిస్తే వినియోగదారులు ఆదరించరని అన్నారు. ఒక ఉత్పత్తిని వినియోగదారులు గుర్తు చేసుకున్నప్పుడు, దాని వెనుక ఉన్న వ్యాపారవేత్త కూడా గుర్తుకు వచ్చేలా నాణ్యతను పాటించాలని సూచించారు. ఒకే తరహా ఉత్పత్తులకే పరిమితం కాకుండా కొత్త ఆలోచనలతో విభిన్న ఉత్పత్తులను రూపొందించాలని చెప్పారు.




### వినియోగదారుల అభిప్రాయాలకు ప్రాధాన్యం

వ్యాపార అభివృద్ధికి వినియోగదారుల అభిప్రాయాలు ఎంతో కీలకమని పెమ్మసాని తెలిపారు. తమ ఉత్పత్తులపై నేరుగా వినియోగదారుల నుంచి అభిప్రాయాలు తీసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. వ్యాపారం ప్రారంభ దశలో నిబంధనలను పక్కన పెట్టి స్వల్పకాలిక ప్రయోజనాల కోసం ప్రయత్నించవద్దని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అన్నారు. మార్కెటింగ్, ప్యాకేజింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు అమ్మకాల వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. అమ్మకాల సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలను వ్యాపారవేత్తలు పరిశీలించాలన్నారు.

### మహిళలకు వ్యాపార అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారని పెమ్మసాని పేర్కొన్నారు. వ్యాపారంలో ఎదురయ్యే సమస్యలను ఒంటరిగా ఎదుర్కోవాల్సిన అవసరం లేదని, స్వయం సహాయక సంఘాల నాయకులు, బ్యాంకుల సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనా, ఇతర వ్యాపార సమస్యలు ఉన్నా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గాలు చూపుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, జీడీసీసీ జిల్లా చైర్మన్ వడ్రానం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

**రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు..**

**రోడ్లపైనే వాహనాల నిలుపుదల**

**ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు తప్పని ఇబ్బందులు**

కారంపూడి, సెప్టెంబర్ 26:(మహి న్యూస్): మండల కేంద్రమైన కారంపూడిలో ఆక్రమణల తొలగింపునకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. మాచర్ల--కారంపూడి, కారంపూడి--వినుకొండ, నకరికల్లు--గురజాల, కారంపూడి--దాచేపల్లి ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఈ నెల 12న రెవెన్యూ అధికారులకు లేఖ పంపారు. ఎఫ్ఎంబీ ఆధారంగా మండల సర్వేయర్లతో సర్వే నిర్వహించి నివేదిక అందించాలని కోరారు. రెవెన్యూ అధికారులు అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. గతంలోనూ ఆక్రమణల తొలగింపునకు అధికారులు ఏర్పాట్లు చేయగా, కొందరు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో స్టే వచ్చినట్లు సమాచారం. దీంతో అప్పట్లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఆక్రమణలు మరింత పెరగడంతో పాటు రోడ్లపైనే వాహనాల నిలుపుదల కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. చెక్‌పోస్ట్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ, బస్టాండ్ వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యాపార సంస్థల ముందు వాహనాలు నిలపడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు మార్గం సరిగా లేక ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం సుమారు 25 గ్రామాలకు అందుబాటులో ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ అవసరాల కోసం కారంపూడికి వస్తుంటారు.



దీంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు. రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### రెవెన్యూ నివేదిక ఆధారంగానే చర్యలు

ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ శాఖ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగానే ముందుకు వెళ్తామని ఆర్అండ్‌బీ డీఈ దాసరి మాధవరావు తెలిపారు. రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులకు సర్వే నిర్వహణకు సంబంధించి లేఖ పంపినట్లు చెప్పారు. పట్టణంలో సర్వే పూర్తిచేసి నివేదిక అందిన అనంతరం రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారుల సమక్షంలో ఆక్రమణల తొలగింపు చేపడతామని తెలిపారు.

### ఎస్ఐఆర్, రీ సర్వే పూర్తయిన తర్వాత



### ఆక్రమణలపై సర్వే

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియలు పూర్తయిన అనంతరం కారంపూడి పట్టణంలో ఎఫ్ఎంబీ ఆధారంగా ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు.

# ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడమే లక్ష్యం

**నాణ్యత, నమ్మకం, సృజనాత్మకతతో వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి**

**గుంటూరును ఎంఎస్ఎంఈ రంగంలో శక్తికేంద్రంగా తీర్చిదిద్దాలి**

**స్థానిక ముడి పదార్థాలతో విలువ జోడించిన ఉత్పత్తులకు ప్రోత్సాహం**

**డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్‌తో విస్తృత మార్కెట్లను అందిపుచ్చుకోవాలి**

గుంటూరు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం, చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమే 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వ్యాపారంలో ఉత్పత్తి నాణ్యత, వినియోగదారుల నమ్మకం, సృజనాత్మకత అత్యంత కీలకమన్నారు. తక్షణ లాభాల కోసం నాణ్యతలో రాజీ పడకుండా వ్యాపారం ప్రారంభించిన తొలి రెండు, మూడు సంవత్సరాలు ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగాలని సూచించారు. ఉత్పత్తికి ప్రత్యేకత, విలువ జోడింపు ఉండేలా చూడాలని తెలిపారు.

### మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి

ఉత్పత్తి తయారీతో పాటు అమ్మకాలు, మార్కెటింగ్‌పై కూడా సమానంగా దృష్టి పెట్టాలని పెమ్మసాని సూచించారు. మంచి ప్యాకేజింగ్, బ్రాండింగ్‌తో ఉత్పత్తులకు మార్కెట్‌ను విస్తరించుకోవచ్చన్నారు. స్థానికంగా లభించే మిర్చి, పత్తి, ఇతర వ్యవసాయ ఆధారిత ముడి పదార్థాలతో విలువ జోడించిన ఉత్పత్తులను తయారు చేసి కొత్త మార్కెట్లను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇంటర్నెట్, వాట్సాప్, ఈ-కామర్స్ వంటి డిజిటల్ వేదికలను వినియోగించుకుని స్థానిక ఉత్పత్తులను గుంటూరు పరిధిని దాటి దేశ, విదేశీ మార్కెట్లకు చేరువ చేయాలని అన్నారు. వ్యాపారవేత్తలకు అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రభుత్వం అందుబాటులో ఉంటుందని తెలిపారు.




### ఎంఎస్ఎంఈ పవర్‌హౌస్‌గా గుంటూరు

గుంటూరు జిల్లాను ఎంఎస్ఎంఈ రంగంలో శక్తికేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ అన్నారు. జిల్లాలో 1.46 లక్షలకుపైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అత్యధిక ఎంఎస్ఎంఈలు ఉన్న జిల్లా గుంటూరు అని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను ప్రోత్సహించే కార్యక్రమానికి గుంటూరు నుంచే తొలి అడుగు పడాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. సూక్ష్మ పరిశ్రమలను బలోపేతం చేయాలి సీఐఐ ఏపీ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 1.47 లక్షలు, రాష్ట్రవ్యాప్తంగా 9.3 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. సూక్ష్మ పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా, చిన్న పరిశ్రమలను మధ్యతరహా పరిశ్రమలుగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ వంటి సాంకేతికతలను వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో ఉత్పత్తి వ్యర్థాలను తగ్గించడం, ఖర్చులను నియంత్రించడం, నాణ్యతను మెరుగుపరచడంతో పాటు దేశ, విదేశీ మార్కెట్లకు ఉత్పత్తులను చేరువ చేయవచ్చన్నారు. పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ప్రతి ఇంటిలో పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, ఏపీ ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# కారంపూడిలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమం



కారంపూడి, సెప్టెంబర్ 26 (మహి న్యూస్):: పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృత్తికా శుక్ల ప్రవేశపెట్టిన స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమాన్ని కారంపూడి మండలంలోని సచివాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మౌనిక, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలు ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉండాలంటే ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయడంతో పాటు ప్రజల సహకారం అవసరమన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, చిన్న వయసులో గర్భధారణ వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని పాఠశాల మధ్యలో చదువు మానకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల వయసు వారిలో మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని తృణధాన్యాలు, పీచు పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవడంతో పాటు నడక, వ్యాయామం, యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని, గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పి.ఎల్. మస్తాన్‌వలి, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు రాముల నాయక్, వెంకటేశ్వర్లు, మణెమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జనసేన నాయకులు విజయ్ కుమార్ ( క్రికెట్ విజయ్ )..



### స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలి..

తిరుపతి, సెప్టెంబర్ 26,మహి న్యూస్ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి గారికి జనసేన పార్టీ సీనియర్ నాయకులు, తిరుపతి పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్ ) హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పనిచేస్తూ, ప్రజల గొంతుకగా నిలిచి జనసేన పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న రామ్ తాళ్లూరి ప్రజా జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలిగి, పార్టీతో పాటు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. అనంతరం ఇరువురు తిరుపతి పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ ప్రస్తుత పరిస్థితులు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసే ప్రతి స్థానంలో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతి కార్యకర్తకు బాధ్యతలు అప్పగించి ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ కొనసాగించాలని ఈ సందర్భంగా సూచించారు.

## టీటీడీ గోశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలి

### వంతారా ప్రతినిధులతో సమావేశంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబర్ 26, మహి న్యూస్ : టీటీడీ గోశాలలను జంతు సంక్షేమం, పరిశుభ్రత, భద్రత, సౌకర్యాల పరంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి సూచించారు. శనివారం తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో టీటీడీ గోశాలలను ఉచితంగా అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా విచ్చేసిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కు చెందిన వంతారా సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో గోశాలలు, జంతు సంరక్షణ కేంద్రాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఆధునీకరించడంతో పాటు జంతువులకు మరింత సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని అదనపు ఈవో సూచించారు. గోశాలల అభివృద్ధిలో భాగంగా గోడలకు టైల్స్ ఏర్పాటు, స్టీల్ నిర్మాణాలకు పెయింటింగ్, పక్షులు, ఇతర జంతువులు ప్రవేశించకుండా జీఐ మెష్ ఏర్పాటు, కొత్త స్టెయిన్‌లెస్ స్టీల్ గేట్ల ఏర్పాటు, గోడల మరమ్మతులు, పెయింటింగ్ తదితర పనులకు సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వంతార సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అదనపు ఈవోకు వివరించారు. పశువుల కదలికలకు అనుగుణంగా స్తంభాల మధ్య దూరం, తగినంత గాలి ప్రసరణ ఉండేలా వీటిని నిర్మించడంతో పాటు, మేత, నీటి వసతులు, సరైన డ్రైనేజీ వ్యవస్థ, గోశాలల పరిసరాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. స్వామివారి కైంకర్యాలకు అవసరమైన పాల ఉత్పత్తులలను సాధ్యమైనంత వరకు తిరుమలలోనే ఉత్పత్తి చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అదనపు ఈవో సూచించారు. స్వామివారి కైంకర్యాలకు అవసరమైన పాల ఉత్పత్తులను తిరుమలలోనే సమకూర్చుకోవడంతో పాటు, గో సంరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ గోశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్, ఎస్వీ గోశాల డైరెక్టర్ శివ కుమార్, ఎస్ఈ వేణు గోపాల్, ఈఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా నూతనంగా ఎన్నికైన తగ్గువారిపల్లి కొంగాటం జగదీష్

### వైయస్సార్సీపి పార్టీకి ఎప్పటికీ రుణపడి ఉంటా. కొంగాటం జగదీష్.



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం సెప్టెంబర్ 26.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తగ్గువారి పల్లి పంచాయతీకి చెందిన యువత నాయకుడు కొంగాటం జగదీష్ కు జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా తనను ఎన్నుకున్నందుకు వైఎస్ఆర్సిపి పార్టీకి ఎప్పటికి రుణపడి ఉంటానని జగదీష్ తెలిపారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తనకు జిల్లా పదవి ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని కొంగాటం జగదీష్ శనివారం పత్రిక ముఖంగా తెలిపారు. తాను గత కొన్ని సంవత్సరాలుగా వైఎస్ఆర్సిపి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడడంతో తనకు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందని కొంగాటం జగదీష్ తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బూమన్ కరుణాకర్ రెడ్డి, పూతలపట్టు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి,జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ ఎం.బి కుమార్ రాజా, మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి మండల వైఎస్ఆర్సిపి నాయకులకు, తగ్గు వారి పల్లి వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు కొంగాటం జగదీష్ తెలిపారు.

## పూర్ణాహుతితో వైభవంగా ముగిసిన

### శ్రీ పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

### శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ



తిరుచానూరు,సెప్టెంబర్ 26,మహి న్యూస్ : తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ అమ్మవారి పవిత్రోత్సవాలు శనివారం మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. పవిత్రోత్సవాల చివరి రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభప్రోక్షణ, నివేదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

### భక్తిభావంతో చక్రస్నానం

మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారితో పాటు శ్రీకృష్ణస్వామివారు, శ్రీసుందరరాజస్వామివారు,శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పల్లకీపై మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పద్మపుష్కరిణి వద్దకు తీసుకెళ్లి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు.



### మాడ వీధుల్లో అమ్మవారి వైభవోత్సవం

సాయంత్రం శ్రీకృష్ణస్వామివారు, శ్రీసుందరరాజస్వామివారు, శ్రీ పద్మావతి అమ్మవారు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో అలరారగా, అమ్మవారి అనుగ్రహాన్ని పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో డా. ఎ. శరత్, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసాచార్యులు, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయలు, రమేష్, సురేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, లక్ష్మీకాంతం, మునస్వామి ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## భారీ డిమాండ్ కారణంగానే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల బుకింగ్‌లో తీవ్ర పోటీ

### ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలను నమ్మవద్దు: భక్తులకు తితిదే విజ్ఞప్తి




తిరుమల, సెప్టెంబర్ 26,మహి న్యూస్ : శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ కేటాయింపుపై భక్తుల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) సమగ్ర వివరణ ఇచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు ఒకేసారి టికెట్ల కోసం ప్రయత్నించినప్పుడు ఏర్పడే ఒత్తిడిని సమర్థంగా తట్టుకునేలా గూగుల్ క్లౌడ్ సాంకేతికత, లోడ్ బ్యాలెన్సింగ్, ఆటో స్కేలింగ్, డిస్ట్రిబ్యూటెడ్ ఆర్కిటెక్చర్ వంటి అత్యున్నత ప్రమాణాలతో ఆన్‌లైన్ వ్యవస్థలను నిర్వహిస్తున్నట్లు తితిదే తెలిపింది. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో వ్యవస్థ పనితీరు మందగించకుండా బహుళ సర్వర్ల ద్వారా సేవలందిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. టికెట్ల విడుదల సమయంలో ప్రత్యేక సాంకేతిక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనువర్తన పనితీరు, మౌలిక వసతులు, లావాదేవీలు, భద్రత తదితర అంశాలను పరిశీలిస్తూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేలా నిపుణుల బృందాలు పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది.

### కోటాతో పోలిస్తే దాదాపు 9 రెట్లు అధిక డిమాండ్

టికెట్లు విడుదలయ్యే సమయంలో దాదాపు 6 లక్షల మంది ఒకేసారి ప్రయత్నిస్తుంటారు. ఒక్కో వినియోగదారు సగటున నలుగురు కుటుంబ సభ్యుల కోసం ప్రయత్నిస్తే దాదాపు 24 లక్షల టికెట్లకు గిరాకీ ఏర్పడుతుంది. అయితే అందుబాటులో ఉన్న కోటా సుమారు 2.69 లక్షల టికెట్లు మాత్రమే. అంటే అందుబాటులో ఉన్న టికెట్ల సంఖ్యతో పోలిస్తే గిరాకీ దాదాపు 9 రెట్లు అధికంగా ఉంటోంది. ఈ కారణంగా వేలాది మంది ఒకే సమయంలో ఒకే సమయ స్లాట్ కోసం ప్రయత్నించడం వల్ల టికెట్లు కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతున్నాయని తెలిపింది.

### వర్చువల్ క్యూ సాంకేతిక ట్రాఫిక్ నియంత్రణ విధానం

ఒకేసారి భారీ సంఖ్యలో అభ్యర్థనలు వచ్చినప్పుడు అంతర్గత వ్యవస్థలపై అధిక భారం పడకుండా, మొత్తం వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేందుకు 'వర్చువల్ క్యూ' విధానాన్ని ఉపయోగిస్తున్నట్లు తితిదే స్పష్టం చేసింది. ఇది భక్తులకు టికెట్లు నిరాకరించేందుకు ఉద్దేశించినది కాదని, రద్దీని క్రమబద్ధీకరించే సాంకేతిక పద్ధతి మాత్రమేనని వెల్లడించింది. అలాగే 'స్లాట్ అందుబాటులో లేదు' అనే సందేశం టికెట్లు త్వరగా ముగిసిపోవడం వల్ల కూడా కనిపిస్తుందని, దీనిని సాంకేతిక వైఫల్యంగా భావించడం సరికాదని తెలిపింది.

### చెల్లింపుల సమస్యలు బాహ్య వ్యవస్థలపై ఆధారపడి ఉంటాయి

ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియ కేవలం తితిదే అనువర్తనంతోనే కాక బాహ్య చెల్లింపు సంస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్కులు, యూపీఐ వ్యవస్థలతో ముడిపడి ఉంటుందని తితిదే వివరించింది. ఏదైనా లావాదేవీ విఫలమైనప్పుడు సమస్య ఏ దశలో ఏర్పడిందో పరిశీలించాల్సి ఉంటుందని, టికెట్ లభించకపోవడాన్ని వ్యవస్థ పనిచేయకపోవడంతో పోల్చకూడదని స్పష్టం చేసింది.

### నిరంతర సాంకేతిక ఆధునికీకరణ

భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఆన్‌లైన్ బుకింగ్, డేటాబేస్ పనితీరు, అధిక లోడ్ నిర్వహణ, భద్రత, సైబర్ రక్షణ, చెల్లింపుల ప్రక్రియల్లో నిరంతరం సాంకేతిక మెరుగుదలలు చేపడుతున్నట్లు తితిదే తెలిపింది. గత రద్దీ ఆధారంగా భవిష్యత్తు డిమాండ్‌ను అంచనా వేస్తూ సర్వర్ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్లు పేర్కొంది. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయాల దర్శన, సేవా కోటాలను కూడా ఇదే ఆన్‌లైన్ విధానం ద్వారా విడుదల చేస్తున్నామని, అక్కడ ఏకకాలంలో భారీ డిమాండ్ లేనందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా బుకింగ్ సాగుతోందని గుర్తుచేసింది. భారీ గిరాకీ ఉన్న సమయంలో ప్రతి ఒక్కరి ప్రయత్నం విజయవంతం కావడం సాధ్యం కాదని, టికెట్ లభించనంత మాత్రాన వ్యవస్థలో లోపం ఉందని భావించవద్దని భక్తులకు విజ్ఞప్తి చేసింది. ఆన్‌లైన్ సేవలను అత్యంత పారదర్శకంగా, సురక్షితంగా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరింది.

## ప్రత్యేక ప్రతిభావంతులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

### టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు

### విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కారం




తిరుపతి, సెప్టెంబర్ 26,మహి న్యూస్ : ప్రత్యేక ప్రతిభావంతులు తమలోని ప్రతిభను గుర్తించి, నైపుణ్యాలను మరింతగా




పెంపొందించుకుని ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు కోరారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని పాత అన్నప్రసాద భవనంలో శనివారం ప్రపంచ బధిరుల దినోత్సవం, అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరాజు మాట్లాడుతూ, ప్రత్యేక ప్రతిభావంతులకు సమాజంలో సముచిత గౌరవం, అవకాశాలు కల్పించేందుకు టీటీడీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ ప్రతిభను సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని సూచించారు. టీటీడీ యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఎస్వీ బధిరుల ఉన్నత పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ గంగాధర్ మాట్లాడుతూ, ప్రత్యేక ప్రతిభావంతులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగం, క్రీడలు, కళలు తదితర రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.




### ఐదుగురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కారం

అనంతరం విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ఐదుగురు ప్రత్యేక ప్రతిభావంతులైన టీటీడీ ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సంకేత భాష చార్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుముందు టీటీడీ పరిపాలనా భవనం ప్రధాన ద్వారం నుంచి సమావేశ మందిరం వరకు ప్రత్యేక ప్రతిభావంతులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్ డైరెక్టర్ మహేష్, టీటీడీ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ కుమార్, స్టేట్ అడ్వైజర్ లక్ష్మీనరసింహులు, టీటీడీలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులైన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రగిరిలో వైకాపాకు గట్టి ఎదురుదెబ్బ ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో తెదేపాలోకి భారీ చేరికలు

### శాశ్వత అభివృద్ధే ధ్యేయం, స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీపే లక్ష్యం: పార్టీలో చేరిన నేతలు

చంద్రగిరి,సెప్టెంబర్ 26, మహి న్యూస్ : చంద్రగిరి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకటమణిప్రసాద్ (నాని) చేపట్టిన విస్తృత పర్యటనలకు ప్రజల



నుంచి భారీ స్పందన లభిస్తోంది. ఆయన నాయకత్వంపై నమ్మకంతో వైకాపాకు చెందిన కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరుతుండటంతో నియోజకవర్గ రాజకీయాల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది.

### పార్టీలో చేరిన చేగు గోవర్ధన్ గుప్తా, బండారు హేమచంద్రా రెడ్డి

వైకాపా సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త చేగు గోవర్ధన్ గుప్తా, మాజీ ఎంపీటీసీ బండారు హేమచంద్రా రెడ్డి



(బండారు సుధా) తమ అనుచరులతో కలిసి తెదేపాలో చేరారు. పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా వారి నివాసాలకు వెళ్లి, పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### శాశ్వత అభివృద్ధే ప్రామాణికం

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ, తాత్కాలిక ప్రయోజనాలు, అమలుకు సాధ్యంకాని హామీలతో ప్రజల జీవన ప్రమాణాలు మారవని, శాశ్వత మౌలిక వసతుల కల్పన ద్వారానే సమాజానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పారదర్శక పాలన, ప్రజా సమస్యల పరిష్కారానికి చూపుతున్న నిరంతర చొరవను చూసే తాము తెదేపాలో చేరినట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా పూర్తి విజయం సాధించేలా శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు.

### విస్తృత పర్యటనకు ప్రజల ఘన స్వాగతం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రజలు, వర్తకులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలు తెలుసుకున్న ఆయన, మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పార్టీపై నమ్మకంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చరిత్రను తెలుసుకుంటూ.. వారసత్వ సంపదను కాపాడుకుందాం




గుర్రంకొండ, మహి న్యూస్, సెప్టెంబరు 26: ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా అన్నమయ్య జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం గుర్రంకొండలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుర్రంకొండ కోట నుంచి కొండపై ఉన్న కోట ప్రాంతం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గుర్రంకొండ కోట చారిత్రక విశిష్టత, నిర్మాణ శైలి, పురాతన వారసత్వ సంపదను ప్రత్యక్షంగా పరిశీలించారు. చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను యువతకు తెలియజేయడంతో పాటు, మన వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించడమే హెరిటేజ్ వాక్ ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. నాగభూషణం తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎమ్. వెంకటరత్నం, లెక్చరర్ షాజహాన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జీజీహెచ్‌లో మెగా వైద్య శిబిరం

**ఒకే వేదికపై వివిధ వైద్య విభాగాల సేవలు**

**నిపుణుల వైద్య పరీక్షలు, సలహాలు అందించిన వైద్యులు**

**ముందస్తు పరీక్షలతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు**

**ప్రభుత్వ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి**



కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సేవా సంకల్ప్ అభియాన్--2026లో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. మెగా వైద్య శిబిరంలో గుండె వైద్యం, మానసిక వైద్యం, క్యాన్సర్ వైద్యం తదితర ప్రధాన వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నిపుణుల సలహాలు, చికిత్సా సేవలను






అందించారు. అదేవిధంగా రక్తనిధి, ఎక్స్‌రే, హెచ్‌ఐవీ, జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమం, జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం తదితర ప్రత్యేక వైద్య సేవలను కూడా ఒకే వేదికపై అందుబాటులో ఉంచారు. దీంతో వివిధ రకాల వైద్య సేవలను ఒకే చోట పొందే అవకాశం ప్రజలకు కలిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. మెగా వైద్య శిబిరం ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు, అవసరమైన చికిత్సా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు వైద్య పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, అనుసంధాన అధికారులు, వైద్యులు, ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శుభకార్యాల్లో కాంక్రీట్ స్టాండ్లనే వినియోగించాలి

**షామియానాల కోసం రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు**

**రహదారులకు నష్టం కలిగించే చర్యలను సహించేది లేదు**

**క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు: కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): కర్నూలు నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాల సందర్భంగా షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులకు ఎలాంటి నష్టం కలగకుండా కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే ఉపయోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులపై షామియానాలు ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని తెలిపారు. రహదారులను తవ్వడం వల్ల ఏర్పడే గోతులను పూడ్చినప్పటికీ రహదారి నాణ్యత దెబ్బతింటుందని, దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రహదారులకు నష్టం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. షామియానాలు, పందిళ్ల ఏర్పాటుకు కాంక్రీట్ స్టాండ్లు లేదా రహదారులకు నష్టం కలగని ఇతర ప్రత్యామ్నాయ పద్ధతులను వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి చర్యలకు పాల్పడితే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం--1994లోని సెక్షన్ 197 ప్రకారం భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. రహదారికి జరిగిన నష్టానికి నిబంధనల మేరకు సంబంధిత కార్యక్రమ నిర్వాహకులతో పాటు కార్యక్రమాలను నిర్వహించే సంస్థలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణలో రహదారులకు నష్టం కలగకుండా నిబంధనలు పాటించాలని కమిషనర్ కోరారు. నిబంధనల అమలుపై నగరపాలక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

# పోలింగ్ కేంద్రాలపై సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత ముసాయిదాపై సమావేశం**

**సూచనలు, అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు**

**వాస్తవ పరిస్థితులు పరిశీలించి తుది జాబితా ప్రచురణ**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల ప్రక్రియలో



భాగంగా పోలింగ్ కేంద్రాల ప్రతిపాదిత ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. వాస్తవ పరిస్థితులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అనంతరం అవసరమైన మార్పులు, చేర్పులు చేసి తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. శనివారం ఎస్‌బీఐ ఉద్యోగుల కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసిన అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, సి-1 రామకృష్ణ, సి-3 శ్రీకాంత్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో త్రీడీ ఓసీటీ పరికరం ప్రారంభం

**రూ.28.50 లక్షల విలువైన అత్యాధునిక పరికరం అందుబాటులోకి**

**రెటీనా సమస్యలను సూక్ష్మస్థాయిలో గుర్తించే అవకాశం**

**ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు**

**ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి టి.జీ. భరత్ గుప్త**

కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో రూ.28.50 లక్షల విలువైన త్రీడీ ఆప్టికల్ కొహరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) పరికరాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జీ. భరత్ గుప్త శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రాయలసీమ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రికి ప్రతిరోజూ సుమారు 400 మంది వైద్యం కోసం వస్తున్నారని మంత్రి తెలిపారు. రాయలసీమలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా అత్యాధునిక పరికరం అందుబాటులో లేదని పేర్కొన్నారు. ఈ పరికరం ద్వారా కంటి రెటీనా సమస్యలను



సూక్ష్మస్థాయిలో గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు. బయట ప్రైవేట్ వైద్య కేంద్రాల్లో ఇదే పరీక్షకు సుమారు రూ.3 వేల వరకు ఖర్చవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్షను ఉచితంగా చేయించుకోవచ్చని మంత్రి తెలిపారు. అదేవిధంగా సుమారు రూ.25 వేల విలువైన సూది మందులు కూడా ఉచితంగా అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. కర్నూలు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో దశలవారీగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన మరిన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి కొత్త పరికరం ఉపయోగాలను మంత్రికి వివరించారు. వయోవృద్ధులు, మధుమేహంతో బాధపడుతున్న వారికి వచ్చే రెటీనా సమస్యలను గుర్తించడంలో ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మంత్రి టి.జీ. భరత్ గుప్త ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సీ.ఎస్.కె. ప్రకాష్, కంటి ఆసుపత్రి హెచ్‌ఓడీ డాక్టర్ యుగంధర్ రెడ్డి, డాక్టర్లు కే.ఎల్.ఎన్. రాజు, కిరణ్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుడాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**బాధితులకు పరిహారం, పింఛన్లు, భూమి, ఉపాధి సదుపాయాలు త్వరగా అందించాలి**

**పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలి**

**అట్రాసిటీ కేసుల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు**

**సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై శాఖల వారీగా స్పష్టమైన వివరాలు ఇవ్వాలి**

**జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ**




కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధిత కుటుంబాలకు పరిహారం, పింఛన్లు, భూమి, ఉపాధి సదుపాయాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం--1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం--1955 అమలుపై మూడో త్రైమాసిక జిల్లా స్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు ఎస్పీ హుసేన్ పీరా, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, బాధితులకు అందుతున్న పరిహారం, పింఛన్లు, భూ కేటాయింపులు, ఉపాధి కల్పన, ఉప ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్షించారు. వివిధ పోలీస్ ఉపవిభాగాల పరిధిలో దర్యాప్తు దశలో ఉన్న కేసుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి అర్హత మేరకు చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని



సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో ప్రభుత్వ న్యాయవాదులతో సమన్వయం చేసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనవరి 2026 నుంచి ఇప్పటివరకు నమోదైన 82 కేసులకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ దశలో రూ.49.50 లక్షలు, చార్జ్‌షీట్ దశలో రూ.80.50 లక్షలు, పింఛన్ల కింద రూ.2.67 లక్షలు చెల్లించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన పరిహారం, పింఛన్ల కోసం రూ.1.82 కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నందున బడ్జెట్ ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. బాధితులకు అందాల్సిన ఆర్థిక సహాయం, పింఛన్లు నిబంధనల ప్రకారం సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో సూచించారు. ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదనే విషయాన్ని బాధితులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అర్హులైన బాధితులకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్వగ్రామంలో భూమి అందుబాటులో లేని సందర్భాల్లో సమీప గ్రామాలు లేదా ఇతర మండలాల్లో ప్రత్యామ్నాయ భూమిని గుర్తించి నిబంధనల మేరకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి అవకాశాలపై తహసీల్దార్లు, ఆర్డీఓలతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అర్హతలు, అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. స్థానిక పరిశ్రమల్లో అర్హత, నైపుణ్యాలు కలిగిన స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే నిబంధన అమలుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, వేధింపులు జరగకుండా గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ రక్షణ, బాధితులకు అందించే పరిహారం, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాధితులపై అదనపు కేసులు నమోదైన సందర్భాల్లో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, అవసరమైన రక్షణ, ప్రభుత్వ సహాయాన్ని నిబంధనల మేరకు అందించాలని సూచించారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

అదనపు ఎస్పీ హుసేన్ పీరా మాట్లాడుతూ విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలవుతున్న వారిని గుర్తించి పరిస్థితిని బట్టి కౌన్సెలింగ్ అందించడంతో పాటు పునరావాస కేంద్రాలకు తరలించి చికిత్స, పునరావాస సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ బృందాల ద్వారా మత్తు పదార్థాల వినియోగం, అక్రమ సరఫరాపై నిఘాను పెంచి, అవసరమైన సహాయం అందించేలా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## మాన్యువల్ స్కావెంజర్లకు సంక్షేమ పథకాలు

మున్సిపాలిటీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న మాన్యువల్ స్కావెంజర్ల సంక్షేమంపై కూడా సమావేశంలో చర్చించారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారి అర్హులైన మాన్యువల్ స్కావెంజర్లకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## సబ్‌ప్లాన్ నిధులపై స్పష్టమైన వివరాలు ఇవ్వాలి

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, ఇప్పటివరకు చేసిన వ్యయం, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేకూరిన ప్రయోజనాల వివరాలను శాఖల వారీగా స్పష్టంగా, ఖచ్చితంగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేటాయింపులు, వ్యయం, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా నివేదించాలని సూచించారు. ఉప ప్రణాళిక కింద కేటాయించిన నిధులను నిర్దేశిత నిబంధనల ప్రకారం ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ కుమార్, ఎల్‌డీఎం మోహన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, జిల్లా స్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సభ్యులు మాలతి, సురేష్ గౌడ్, వెంకట నాగరాజు, ఎం. మద్దిలేటి, కే. మద్దిలేటి, మధు నాయక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 629 మంది పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

**9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏపీఎస్పీ ట్రైనీ కానిస్టేబుళ్లు**

**ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో 430 మంది.. డీటీసీలో 199 మంది**

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టి.జీ. భరత్ గుప్త**

**శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించాలి**

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి**

కర్నూలు, సెప్టెంబర్ 26: (మహి న్యూస్): కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో 430 మంది, కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 199 మంది కలిపి మొత్తం 629 మంది ఏపీఎస్పీ ట్రైనీ



కానిస్టేబుళ్ల 9 నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ పరేడ్ మైదానంలో 2025--26 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర



పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జీ. భరత్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో శిక్షణార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణతో కూడిన కవాతు, మార్చ్‌పాస్ట్ ఆకట్టుకున్నాయి. శిక్షణ సమయంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ట్రైనీ కానిస్టేబుళ్లకు మంత్రి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉత్తమ డ్రిల్ శిక్షకులకు కూడా ప్రశంసా పత్రాలు, అవార్డులు ప్రదానం చేశారు.



## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

ఈ సందర్భంగా మంత్రి టి.జీ. భరత్ గుప్త మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణ అనంతరం ట్రైనీ కానిస్టేబుళ్లు ప్రదర్శించిన పరేడ్ అభినందనీయంగా ఉందన్నారు. శిక్షణను సమర్థవంతంగా అందించిన శిక్షకుల కృషిని ప్రశంసించారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా కానిస్టేబుళ్లు సేవా దృక్పథంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అసాంఘిక శక్తులు, రౌడీ మూకల్లో చట్టంపై భయం కలిగేలా కఠినంగా వ్యవహరిస్తూనే, సామాన్య ప్రజలు ప్రశాంతంగా జీవించేలా రక్షణ కల్పించాలన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వం సమకూరుస్తున్న కృత్రిమ మేధస్సు, సీసీటీవీ నెట్‌వర్క్, వాహనాల కదలికల విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేర పరిశోధన, నిందితుల గుర్తింపును వేగవంతం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. పిల్లలను దేశసేవకు, పోలీసు వృత్తికి అంకితం చేసిన తల్లిదండ్రుల త్యాగం వెలకట్టలేనిదని మంత్రి పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరుద్యోగ యువత సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో క్రమం తప్పకుండా పోలీసు నియామకాలు చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సమగ్ర శిక్షణ అందించాం

ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణలో భాగంగా ట్రైనీ సిబ్బందికి ఆధునిక పోలీసింగ్‌కు అవసరమైన వివిధ అంశాల్లో సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన ట్రైనీలు

ఏపీఎస్పీ 2వ బెటాలియన్:
- ఉత్తమ ఆల్‌రౌండర్, ఉత్తమ ఇండోర్: నందికం శ్రీనివాసులు
- ఉత్తమ అవుట్‌డోర్: ముప్పురి ప్రశాంత్
- ఉత్తమ ఫైరర్: పరస తరుణ్ కుమార్
- పరేడ్ కమాండర్: అంకె నంద కుమార్

డీటీసీ:
- ఉత్తమ ఆల్‌రౌండర్, ఉత్తమ ఇండోర్: చప్పటి రోహిత్
- ఉత్తమ అవుట్‌డోర్: లక్కింశెట్టి మహేష్
- ఉత్తమ ఫైరర్స్: వెంకట సాయి కృష్ణారెడ్డి, అసది శివ శంకర్

కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్, అదనపు ఎస్పీ (పరిపాలన), డీటీసీ ప్రిన్సిపాల్ జి. హుస్సేన్ పీరా, అదనపు కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి. వెంకట రమణ, ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి. దుర్గా ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు, శిక్షణ సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షులు



కడప, సెప్టెంబర్ 26 (మహి న్యూస్): కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను కడప ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ, అభివృద్ధి అంశాలపై పరస్పరం చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల ధర్నాకు టీడీపీ, బీజేపీ నాయకుల సంఘీభావం

### 10 వ రోజుకు చేరుకున్న ధర్నా.



గాలివీడు:సెప్టెంబర్26(మహి న్యూస్ ): మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సంఘం రాష్ట్ర కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏలు నిర్వహిస్తున్న ధర్నాకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి శివారెడ్డి, మాజీ సర్పంచ్ వీరభద్రప్ప నాయుడు,సాయి రెడ్డి, శివా రెడ్డి,బీజేపీ నాయకులు రమణారెడ్డి, దివాకర్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు.ఈసందర్భంగా నాయకులు వీఆర్ఏలకు పూలమాలలు వేసి వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు.అనంతరం వీఆర్ఏలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏలకు వారసత్వ హక్కు కల్పించాలని, ప్రమోషన్లు కల్పించాలని, నెలకు రూ.21 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.



అలాగే విధుల్లో ఉన్న వీఆర్ఏలు మరణించిన సందర్భంలో వారి కుటుంబంలోని ఒకరికి వయోపరిమితి లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వీఆర్ఏలు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## జమ్మలమడుగులో సెప్టెంబర్ 29న మెగా జాబ్ మేళా

### 200 ఉద్యోగాలకు యువత ఎంపిక.. 18 నుంచి 33 ఏళ్ల వారికి అవకాశం

జమ్మలమడుగు,మహి న్యూస్ సెప్టెంబర్ 26: వైఎస్ఆర్ కడప జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి--శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్యాధికారి ఎ. సురేష్ కుమార్ తెలిపారు. జమ్మలమడుగులోని జాతీయ నిర్మాణ అకాడమీ వద్ద ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ సంస్థలు ఏఐఎల్ డిక్సన్, ఆడెసీ బై ఛానల్ ప్లే లిమిటెడ్ ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి.

### ఏఐఎల్ డిక్సన్‌లో 100 ఖాళీలు:

ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18--30 ఏళ్ల పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనంతో పాటు ఇతర ప్రయోజనాలు ఉంటాయి. ఉద్యోగ స్థలం కొప్పర్తి, కడప.

### ఆడెసీలో 100 ఖాళీలు:

ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అర్హత కలిగిన 19--33 ఏళ్ల పురుషులు, మహిళలకు అవకాశం ఉంది. నెలకు రూ.11,800 నుంచి రూ.12,500 వరకు వేతనంతో పాటు ఇతర ప్రయోజనాలు అందనున్నాయి. ఉద్యోగ స్థలం కొప్పర్తి విద్యుత్ తయారీ పరిశ్రమల సముదాయం.

### అభ్యర్థులు తీసుకురావాల్సినవి

జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా నైపుణ్య పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. రెజ్యూమ్, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాన్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలు పొందాలని జిల్లా ఉపాధి, నైపుణ్యాధికారి ఎ. సురేష్ కుమార్ కోరారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



రాయచోటి మహిన్యూస్ సెప్టెంబర్ 26 : వీరబల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనగాని రామ్మోహన్ ను ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయులు, విద్యార్థులందరి సమక్షంలో ఘనంగా సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య మాట్లాడుతూ రామ్మోహన్ చక్కటి క్రమశిక్షణ కలిగి కాలాన్ని వృధా చేయకుండా విద్యార్థులకు చక్కగా తెలుగు బోధించేవారన్నారు .అంతేకాకుండా విద్యార్థుల పుట్టినరోజు సందర్భంగా ప్రతి విద్యార్థి చేత మొక్కలు నాటించే వారని, పాఠశాలలో పనిచేసే వంట మనసులకు , ఆయాలకు నైట్ వాచ్మెన్ లకు కొత్త బట్టలు పంపిణీ చేసేవారన్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో విద్యార్థిగా చేరి, ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరి ,ఇదే పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు తీసుకోవడం నా పూర్వ జన్మ సుకృతం అని తెలిపారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కొంత మంది ఉపాధ్యాయలకు అవార్డు పేరు తెస్తే రామ్మోహన్ అవార్డుకే గౌరవం తెచ్చారని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెక్కవాండ్లపల్లి వినాయకుడిని ఘనంగా నిమజ్జనం

### భక్తుల కోలాహలం.. స్నేహితుల సందడి.

### -పోలీసుల సేవలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు.



గాలివీడు:సెప్టెంబర్ 26(మహి న్యూస్ ): చెక్కవాండ్లపల్లిలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్నేహితులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో నిమజ్జన వేడుక కోలాహలంగా సాగింది. డప్పులు, మేళతాళాల నడుమ భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చేపట్టిన భద్రతా ఏర్పాట్లకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. వేడుకల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, స్నేహితులు, యువత, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి : సుధాకర్



రాయచోటి, మహిన్యూస్ సెప్టెంబర్ 26: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటే వర్షాలు పడవని కొందరు చేసిన అసత్య ప్రచారాలకు ప్రకృతి, దేవుడు సరైన సమాధానం ఇచ్చారని రాయచోటి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ అన్నారు. రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్నీనో ప్రభావం భయాందోళనలు రేకెత్తిస్తున్న తరుణంలో కూడా రాష్ట్రంలో ఈ స్థాయిలో వర్షాలు పడటం వల్ల రైతన్నలు ఆనందోత్సవంలో మునిగితేలుతున్నారని తెలిపారు. పంటలకు జీవం పోసిన ఈ వర్షాలు రైతు గుండెల్లో కొత్త ఆశలు నింపడమే కాకుండా అసత్య ప్రచారాలు చేసిన వారి నోళ్లు మూయించాయన్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో కూడా కరెంటు చార్జీలను పెంచకుండా, ట్రూ అప్ చార్జీల భారాన్ని కూడా తగ్గించిన ఘనత సీఎం చంద్రబాబు దక్కుతుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి గుర్రం సుబ్బయ్య నాయుడు పాల్గొన్నారు.

## “పోలీసు అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా కల్పించాలి”...!!

### క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వహించాలి

### దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత

### యూనిఫాం గౌరవంతో పాటు బాధ్యతను కూడా ఇస్తుంది: జిల్లా కలెక్టర్

### ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి: జిల్లా ఎస్పీ

### శిక్షణ పూర్తి చేసుకున్న 521 మంది నూతన కానిస్టేబుళ్లకు, సిబ్బందికి అభినందనలు



కడప, మహి న్యూస్ సెప్టెంబరు 26: “పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం ఎంతో కీలకం. పోలీసు యూనిఫాం ప్రజలకు భరోసా కల్పించేలా పనిచేయాలి. పోలీసు-అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా అనే భావన ప్రజల్లో కలిగేలా



ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలి” అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత నూతన పోలీసు కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 521 మంది నూతనంగా శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి మంత్రి సవిత హాజరుకాగా, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ఈ దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్లు ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో కడప పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 194 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

### పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక : మంత్రి సవిత

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని అన్నారు. దీక్షాంత్ పరేడ్ కేవలం ఒక పరేడ్ మాత్రమే కాదు.. శిక్షణార్థి నుంచి బాధ్యతాయుతమైన పోలీసు సిబ్బందిగా మారే కీలక ఘట్టం అన్నారు. క్రమశిక్షణ, సమన్వయం, ఆత్మవిశ్వాసం, విధి పట్ల అంకితభావాన్ని చాటిన నూతన కానిస్టేబుళ్లు ఇకపై ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నారు. సుమారు 6 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో అనేక అడ్డంకులను అధిగమించి నియామకాలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు ఇచ్చే నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణా కేంద్రాల్లో సుమారు 5,800 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. పోలీసులు చట్టాన్ని గౌరవిస్తూ, ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పోలీసు సిబ్బంది ప్రజల సమస్యలను ఓపికగా విని, మానవీయ దృక్పథంతో స్పందించాలన్నారు. ఉపాధ్యాయులపై కొందరు దుష్ప్రచారం చేయడం, వారి వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటం వల్ల వారు తీవ్రంగా బాధపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు, సాంకేతిక ఆధారిత నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి కొత్త సవాళ్లు పోలీసుల ముందున్నాయని మంత్రి అన్నారు. అందువల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు కొత్త చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాలానుగుణంగా.. పరిణతి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అలవర్చుకోవాలన్నారు. పోలీసు యూనిఫారంలో తన బిడ్డను చూడాలని, సమాజాన్ని రక్షించడంలో తమబిడ్డ కూడా ఒక బృహత్తర బాధ్యతను నిర్వహించేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. పౌరుషాలకు, ప్రేమాభిమానాలకు, ప్రాణాలకు ప్రాణాలు ఫణంగా పెట్టె స్వభావం ఉన్న ఈ రాయలసీమ గడ్డపై.. 11వ బెటాలియన్ లో ఉన్నతమైన ఆశయాలతో, ప్రజల్లో రక్షణపై విశ్వాసాన్ని నపుతున్న సమగ్రమైన దీక్షణను అందిస్తున్న పోలీసు అధికారులకు సగర్వంగా అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రక్షణ రంగం పటిష్టత కోసం రూ.9.165 కోట్లు బడ్జెట్ ను కేటాయించిందన్నారు. అలాగే సమాజంలో నిరంగతర రక్షణ కల్పన దిశగా ఈగల్ వింగ్, ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల ఆత్మ రక్షణ కోసం “శక్తి” యాప్ ని సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖను మరింత దృఢతరం చేసే ఉద్దేశ్యంతో, సమాజ శ్రేయస్సు కోసం రక్షణ రంగంలో అడుగిడాలనుకునే యువతకు ఉద్యోగ అవకశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 6050 పోస్టులను విడుదల చేసి... మరో రెండువేల అదనపు ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్థులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే.. పోలీసు కుటుంబాల శ్రేయద్దు కోసం పోలీసు బీమా సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

### యూనిఫాం గౌరవంతో పాటు బాధ్యతను కూడా ఇస్తుంది: కలెక్టర్

నూతన కానిస్టేబుళ్లకు దీక్షాంత్ పరేడ్ ఒక కొత్త బాధ్యతాయుతమైన ప్రయాణానికి శ్రీకారం చుడుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. తొమ్మిది నెలల కఠిన శిక్షణ అనంతరం నేడు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ప్రతి కానిస్టేబుల్ తన విధి పట్ల అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. “పోలీసు యూనిఫాం గౌరవాన్ని మాత్రమే కాదు.. గొప్ప బాధ్యతను కూడా ఇస్తుంది. మీరు చేసే ప్రతి పని పోలీసు శాఖ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుంది. ప్రజలతో మర్యాదగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి. బాధితులకు అండగా నిలిచి, చట్టాన్ని కాపాడుతూ ప్రజలకు భద్రత కల్పించాలి” అని కలెక్టర్ సూచించారు. సమాజంలో రక్షణ శాఖ ద్వారా సహాయం కోరేవారు చాలా మంది ఉంటారని.. పోలీసుశాఖపై వారికున్న నమ్మకాన్ని, రక్షణ, సాయం చేస్తారని మీపై పెట్టుకున్న విశ్వాసాన్ని కొమ్ము చేయకుండా.. సమాజ సేవ చేయడానికి.. ప్రభుత్వం మీకందిస్తున్న గొప్ప అవకాశాన్ని ప్రతి యువ పోలీసు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం సమాజంలో ఎంతోమంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బాధ్యులవుతున్నారని.. అలాంటి వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ.. నేరాల నుండి అమాయక ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పోలీసు యంత్రాంగం గౌరవప్రదంగా స్వీకరించాలని సూచించారు. సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. “క్రమశిక్షణతో విధి.. నిజాయితీతో సేవ.. మానవత్వంతో ప్రజలకు రక్షణ” అనే స్ఫూర్తితో పనిచేయాలని నూతన కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు.

### ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి: జిల్లా ఎస్పీ

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ... 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు విధుల్లోకి అడుగుపెడుతున్న నూతన కానిస్టేబుళ్లు శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, విధి నిర్వహణ నైపుణ్యాలను సేవలో కొనసాగించాలని సూచించారు. “ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత. పోలీసు యూనిఫారం అనేది కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు. ప్రతి పరిస్థితిలో సంయమనంతో వ్యవహరిస్తూ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. మీ విధి నిర్వహణలో నిజాయితీ, అంకితభావం, ధైర్యం ఎప్పుడూ ముందుండాలి” అని ఎస్పీ సూచించారు. నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు, సాంకేతిక పరిజ్ఞానం, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని తెలిపారు.



పోలీసు సేవలో ప్రతి రోజు కొత్తగా నేర్చుకునే అవకాశమేనని, ప్రజా సేవను గర్వంగా భావించి విధులు నిర్వర్తించాలని సూచించారు.

### అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు..

దీక్షాంత్ పరేడ్ సందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు అందజేసి అభినందించారు. అనంతరం నూతన కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు అధికారులు, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నత అధికారులు, వివిధ కేటగిరీలకు చెందిన పోలీసు, బెటాలియన్ సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ పిఆర్వో వెంకట్ యాదవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా సాగించారు.

## అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టాలి..!!

### భారత పౌర విమానయాన శాఖ గౌరవ కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు

### జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ లతో కలిసి కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన పనుల పురోగతి పరిశీలన

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 26 : అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో.. అధునాతన సౌకర్యాలతో అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని.. భారత పౌర విమానయాన శాఖ



గౌరవ కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు ఎయిర్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కడప ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిని భారత పౌర విమానయాన శాఖ గౌరవ కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, రాజ్యసభ సభ్యులు సీఎం సురేష్ నాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీమీనా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ప్లానింగ్ హెడ్ అనిల్ గుప్త, ఎయిర్ పోర్ట్ అథారిటీ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, జిల్లా నాయకులు భూపేష్ రెడ్డి, మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎయిర్ పోర్ట్



టర్మినల్ భవన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని.. భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. నూతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో, భద్రతా ప్రమాణాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అన్ని రకాల అధునాతన వసతులతో నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా.. పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబందిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాతూ.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్‌ను మొదటి, రెండో దశల్లో విస్తరించేందుకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. సిటీ సైడ్ అభివృద్ధి, చేరుకునే రహదారి, పార్కింగ్, సేవా భవనం, అగ్నిమాపక కేంద్రం, విమాన రాకపోకల నియంత్రణ కేంద్రం, ఐసోలేషన్ బే, డీవీఓఆర్, సౌర విద్యుత్ కేంద్రాలకు ప్రణాళికలో స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. కడప-బెంగళూరు, కడప-తిరుపతి, కడప-నెల్లూరు రహదారుల అభివృద్ధితో విమానాశ్రయానికి రహదారి అనుసంధానం మరింత మెరుగుపడుతుందని వివరించారు. 2022-23లో సుమారు 70 వేల మంది మాత్రమే వినియోగించిన కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉడాన్ పథకం కింద ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లోనూ విమానాల రాకపోకలకు వీలుగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు. కడప జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 25 లక్షల మంది ప్రజలకు ఈ విమానాశ్రయ అభివృద్ధి ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. అంతకుముందు.. కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని ఎయిర్‌పోర్ట్ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్.. కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. దాదాపు 80 శాతం మేర నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 మార్చి 10న వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 14 విమానాశ్రయాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కడప విమానాశ్రయ నూతన టెర్మినల్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సుమారు రూ.266 కోట్ల అంచనా వ్యయంతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు వివరించారు. కడప విమానాశ్రయం మొత్తం 1,110 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, 2,515 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో ఉన్న రన్‌వే కోడ్-సి రకం విమానాలకు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. 16,455 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నూతన టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తున్నామని, ఏటా 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా, రద్దీ సమయాల్లో గంటకు 1,800 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో టెర్మినల్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. టెర్మినల్‌లో 24 చెక్-ఇన్ కౌంటర్లు, మూడు ఏరో బ్రిడ్జిలు, రెండు సామాను కన్వేయర్ బెల్టులు, మూడు భద్రతా తనిఖీ యంత్రాలు, 375 కార్ల పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఏకకాలంలో ఏడు కోడ్-సి విమానాలను నిలిపే సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, రెవెన్యూ, స్థానిక జిల్లాప్రజాప్రతినిధులు,ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

### చిన్నారి వైద్యం కోసం రూ.30 లక్షలు అవసరం.

### తన బిడ్డ ప్రాణాలు కాపాడాలని తల్లి కన్నీటి వేడుకోలు.

### దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబం.

గాలివీడు:సెప్టెంబర్26(మహి న్యూస్ ): అప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి భవనీత్ వైద్యానికి సుమారు రూ.30 లక్షలు అవసరమవడంతో, ఆర్థిక సాయం కోసం తల్లిదండ్రులు దాతలను వేడుకుంటున్నారు. తమ బిడ్డకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని తల్లి శ్రీదేవి, తండ్రి వెంకటరమణ కన్నీటి పర్యంతమవుతూ విజ్ఞప్తి



చేస్తున్నారు.గాలివీడు మండలం నూలివీడు గ్రామం కొత్తపల్లి హరిజనవాడకు చెందిన వీరబల్లి వెంకటరమణ అద్దె ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య శ్రీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత మూడు నెలలుగా మూడేళ్ల కుమారుడు భవనీత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చిన్నారికి వైద్యం కోసం తల్లిదండ్రులు చెన్నై, బెంగళూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లోని పలు ఆసుపత్రులను సంప్రదించారు. ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో చిన్నారికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పాటు సపోర్టివ్ డయాలసిస్ అవసరమని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు



తెలిపినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న తమ కుటుంబానికి ఇంత భారీ మొత్తాన్ని సమకూర్చడం సాధ్యం కావడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు మానవత్వంతో స్పందించి దాతలు తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నారు. సహాయం అందించేందుకు చిన్నారి భవనీత్ వైద్య చికిత్సకు సహాయం చేయదలచిన దాతలు తండ్రి వీరబల్లి వెంకటరమణకు ఫోన్‌పే / గూగుల్‌పే: 7997510574 ద్వారా తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com